
# ఈ దారి ముందుకే!

శీలా సుభద్రాదేవి



ఆగిపోయావేం? కొట్టమ్మా!

ఆఖరికి చంపినాసరే నేను యిందుకు ఒప్పుకునేదిలేదు'' అంది సువర్ణలత. ఆమె కంఠం నిశ్చలంగా వుంది.

సువర్ణని ఒప్పించడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావటంతో వెర్రికోపంతో చెయ్యెత్తిన రాజ్యలక్ష్మి నిశ్చలంగా విగ్రహంలా వున్న కూతురి మీద చెయ్యివేసే సాహసం లేక నిస్సహాయతతో కూడిన కోపంతో తనని తాను నిందించుకో సాగింది. ''నిన్నెందుకే తల్లీ కొట్టటం, చంపడమూను. అసలు దౌర్భాగ్యం అంతా నాది. నువ్వు యిష్టం లేదంటున్నా మెడకి కట్టినందుకు నాదేనే తల్లీ తప్పు. ఇంతవరకూ అన్నీ సవ్యంగా జరిపి ఇప్పుడు అల్లుడికి ఏమి సమాధానం చెప్పాలనేదేనే నా బాధ. అంతా జరిగాక నువ్వే సమాధాన పడిపోతావనుకున్నాం కానీ యింత మొండితనం చేస్తావనుకుంటే ఇదంతా చేసేవాళ్ళమే కాదు. ఒక్కగానొక్క కూతురి పెళ్ళి చూడకుండా ఆ జబ్బుతో పోతానేమోనని యింత తొందర చేశాను, ఇదంతా నా తప్పేనే.''

అంతవరకూ నిశ్చలంగా వున్న సువర్ణ తల్లి ఏడుపుతో కొంచెం కదిలింది. 'ఒక్కగానొక్క కూతు'ర్ననే తనాడిన ప్రతీ ఆటనీ సాగనిచ్చారు తన తల్లీతండ్రీ. యస్సెల్సీ కాగానే చదువు మానిపించాలనుకుంది అమ్మ, కానీ వాళ్ళకి యిష్టం లేకపోయినా తనమాట ప్రకారమే బియ్యే వరకూ చదివించారు. ఎక్కడికి వెళ్ళాలనుకున్నా సాధ్యమైనంత వరకూ తన కోరిక తీర్చడానికే చూసేవారు నాన్న. అన్నయ్యలు ముగ్గురికన్నా అన్ని విధాలా తననే బాగా చూసుకునేవారు. తమకి

తాముగా తనచేత చేయించదలచింది యిదొక్కటే. ఇంత బాధ పడుతూ, కోరుతున్న తల్లి కోరిక ఈ ఒక్కటే తను తీర్చలేదా? ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది.

"ఊఁ సరేలే. జడవెయ్యి" అంటూ మేనత్తవైపు జరిగింది.

అంతవరకూ నాటకం చూస్తున్నట్లు కళ్ళప్పగించి ఉండిపోయిన మేనత్త ఉలికిపడి సువర్ణ జుత్తు చేతిలోకి తీసుకొని చిక్కు తీయటం మొదలెట్టింది.

ఆ గదిలో మేలుకొని ఉన్న ఒక రిద్దరు దగ్గరబంధువులు నాటకం అయిపోయిందన్నట్టు నిద్రకి ఉపక్రమించారు.

ఇక మిగిలింది సువర్ణ తన స్నేహితురాలు వకుళా. సువర్ణ తన పథకం గురించి ఆలోచిస్తోంది.

వకుళ ఒక్కొక్క పువ్వే సువర్ణ మేనత్తకి అందిస్తూ సువర్ణ గురించే ఆలోచిస్తోంది—

చదువుకునే రోజుల్లో కూడా కాబోయే భర్తల గురించో, పెళ్ళిళ్ళ గురించో ఏదైనా చర్చ వస్తే సువర్ణకి నచ్చేదికాదు.

* * *

రెండు నిమిషాలు సువర్ణ అల్లాగే నిలబడింది. ఎంతకూ మంచం మీదున్న రంగనాథరావు కదిలే సూచనలు కనిపించలేదు. అనవసర కాలయాపనకు కొంచెం చికా కనిపించింది. గుండెల మీద బరువు వేగం దించేసుకుంటే తర్వాత దాని ఫలితం ఎలావుంటుందో చూసుకొని ఏదో నిర్ణయానికి వచ్చేయవచ్చు అనుకుంది. మెల్లగా ఓ నాలుగడుగులు వేసింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. నిశ్శబ్ద ప్రకృతిని చూసి ఆమె కాలి మువ్వల మట్టెలు కిలకిల్లాడాయి.

ఆ మట్టెల కిలకిలలు రంగనాథరావు గుండెలో గిలిగింతలు పెట్టాయి. ఆమె వచ్చి ఏం చేస్తుందో అనుకుంటూ ఊహల్లో తేలిపోయాడు. మూసుకున్న రెప్పల మీదనో, పెదాల మీదనో ఏ పువ్వుతోనో సున్నితంగా తాకిస్తుందేమో. లేకపోతే ఆమె పెదాలనే తాకిస్తుందో. మువ్వల శబ్దం తన దగ్గరికి వచ్చి ఆగిపోయింది. ఎప్పటికీ ఏమీ జరగక పోవటంతో కళ్ళు తెరిచాడు. తనవైపే చూస్తూ కనిపించింది. చటుక్కున లేచి ఆమె చెయ్యిపట్టుకొని మంచంమీద కూర్చోమని లాగాడు. ఆమె చెయ్యి విదిలించేసుకుంది. ప్రశ్నార్థకంగా చూశాడు.

"చూడండీ... మీకు ఓ విషయం చెప్పాలి. ఇవన్నీ పెళ్ళి కాక ముందే మీకు తెలియజేయాలని ప్రయత్నించాను. కానీ, వీలు కుదరలేదు. నాకు..." అతని ముఖంలోకి పరిశీలనగా చూస్తూ ఆగిపోయింది.

"ఊ... నీకు..." ప్రక్క మీద ఒక పువ్వును తీసి రేకురేకునీ సున్నితంగా రాస్తూ రెట్టించాడు.

"నాకు... ఈ రకం జీవితం అంటే ఇష్టంలేదు" పాఠం అప్పజెప్పినట్లు గబాలున చెప్పిందేకాని అతని ముఖంలోకి చూడలేకపోయింది.

రబ్బరు బుడగకి ఏమూలో తెలియకుండానే కళ్ళకి కనిపించనంత రంధ్రం పడినట్లు గుండెలు కుంచించుకుపోతున్నాయి, ఏమీ మాట్లాడలేకపోయాడు.

"మీకు భార్యగా అన్ని సౌకర్యాలు చూస్తాను. మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభిమానించి ప్రేమిస్తాను. కానీ... కానీ..." మరి చెప్పలేక ఆగిపోయింది.

మొదట్లో రంగనాథరావు ఆమె హాస్యం

ఆడుతుందేమో అనుకున్నాడు. కాని మరో అయిదు నిమిషాలకు ఆమె మనస్తత్వం అర్థమైంది.

రంగనాథరావు మౌనంగానే మంచంమీద నుండి లేచి తలగడ ఒకటి తీసుకొని పడక్కుర్చీలో వాలాడు.

పరిస్థితి తనకి అనుకూలంగానె కనిపించటంతో మనసు తేలికై కళ్ళు మూసుకుంది. ఉదయం నుండి శారీరకంగానే కాక మానసికంగా కూడా విశ్రాంతిలేక పోవటాన వెంటనే నిద్ర పట్టేసింది.

ఉదయంలేచి మామూలుగానే తిరుగుతున్న సువర్ణని చూసి తల్లి, వదిన అందరి మనసులు తేలికైనాయి. ఏదో చిన్నతనంతో మొండి చేయబోయింది, కానీ ఎలాగోలా దారికి వచ్చింది అనుకున్నారు. పెళ్ళికొడుకు ఆ రోజంతా ముభావంగా ఉన్నట్లు తెలిసినా సువర్ణ దారికొచ్చిందన్న సంతోషంలో వీళ్ళెవ్వరూ దానికంత ప్రాముఖ్యత యివ్వలేదు.

ఆ మరుసటి ఆ రోజు సువర్ణ అల్లరి పెట్టకుండా నిశ్చింతగానే గదిలోకి వెళ్ళింది. తనమాట అర్థంచేసుకుని మసలుతున్న భర్త మీద అభిమానం కలిగి కొంచెం స్నేహంగా తనకి తానే మాట్లాడటానికి ప్రయత్నించింది. ఆమె చొరవని రంగనాథరావు మరోలా అర్థం చేసుకున్నాడు. నిన్నటిలాగే విడిగా పడుకోటానికి వెళ్తాడేమో అని చూసింది. కానీ అతనా ప్రయత్నం చేయకుండా ఉత్సాహం తెచ్చుకుని సరదాగా కబుర్లు చెప్పసాగాడు. కబుర్లు చెబుతూ మధ్యలో ఆమెని దగ్గరికి హత్తుకుని చటుక్కున ముద్దు పెట్టుకున్నాడు. కళ్ళలో భయం గిరికీలు కొట్టింది. అర్థంలేని అసహ్యం నర నరాల్లో జరాజరా పాకినట్లయింది. అతన్ని వదిలించుకోవటానికి ప్రయత్నించింది. అనుకోని సంఘటనకు మానసికమైన ఆ ఒత్తిడికి తట్టుకోలేక పోయింది, వేల్లాడిపోతున్న సువర్ణ శరీరం చల్లగా తగిలేసరికి రంగనాథరావు మైకం దిగిపోయింది.

మూడోరోజు భయంభయంగానే అడుగు పెట్టింది సువర్ణలత. రంగనాథరావు పడక కుర్చీలో పడుకోవటంచూసి కొంత భయం నిశ్శబ్దంలో కరిగి పోయింది. మౌనంగానే ఆ రాత్రి గడిచిపోయింది. ఆ మర్నాడు రంగనాథరావు ఆఫీసుకి సెలవు లేదని సువర్ణని త్వరలో దిగబెట్టమని చెప్పేసి వెళ్ళిపోయాడు.

### జలనిధి ప్లూటో

సౌర కుటుంబంలోని బహు చిన్న గ్రహం ప్లూటో. సూర్యుడినుంచి భూమి దూరంకంటే ముప్ఫయితొమ్మిది రెట్లు ఎక్కువ దూరంలో ప్లూటో గ్రహం ఉందని ఖగోళ శాస్త్రజ్ఞుల లెక్క. ఈ గ్రహాన్ని గురించి, దాని స్వరూప స్వభావాలను గురించి ఇప్పటి వరకు తెలిసింది చాలాతక్కువ. సూర్యకాంతి ప్రసారం ఈ గ్రహంమీద చాలా బలహీనంగా ఉంటుందట; అందువల్ల, అక్కడి శీతోష్ణ పరిస్థితి సున్నా డిగ్రీలో ఉంటుందని శాస్త్రజ్ఞుల ఊహ. ఇంతకు ముందు భావించినట్లు ప్లూటో వ్యాసం (చుట్టుకొలత) ఆరువేల కిలోమీటర్లు ఉండదని, ఇప్పటి అంచనాల ప్రకారం దీని చుట్టుకొలత మూడువేల తొమ్మిది వందల కిలోమీటర్లు మాత్రమేనని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

నాల్రోజులకోసారి రంగనాధరావునుండి ఉత్తరం వచ్చేది సువర్ణకు. ప్రతీ ఉత్తరం శృంగారంతో నిండి విశృంఖలంగా సాగేది. ఆమె దృష్టి మరల్చటానికి రంగనాధరావు ప్రయత్నం ప్రతి వాక్యంలో తొంగిచూసేది. కానీ సువర్ణని ఆ వుత్తరాలు ఏ మాత్రం కదల్చకపోగా అసహ్యంతో ఆమె ఒళ్ళు గగుర్పొడిచేది. ఇంట్లో ఎవ్వరూ అతని దగ్గరికి వెళ్ళటానికి ఆ మెని ఒప్పించలేక పోయారు.

వకుళ ప్రతీ ఉత్తరంలో స్నేహితురాల్ని ఒప్పించటానికి ప్రయత్నించేది. కాని ఓసారి 'ఇలాంటి ఉత్తరాలు రాస్తే నేను నీకు మరి ఉత్తరాలు రాసేదిలేదు' అని కోపంగా సువర్ణలత రాయటంతో వకుళకూడా పై పై విషయాలతోనే ఉత్తరాలు రాయసాగింది.

నాల్రోజులకోసారి వచ్చే అతని వుత్తరాలు క్రమంగా వారాల్లోకి, నెలల్లోకి చివరికి సంవత్సరాల్లోకి వచ్చి మరిక సాగలేక ఆగి పోయాయి.

రంగనాధరావు మరో పెళ్ళిచేసుకున్నాడని తెలిసింది సువర్ణలతకు. ఆ వార్త ఆమెని ఏమాత్రం కదల్చలేక పోయింది. ఇతరుల గురించి ఆలోచించుకోవడం తప్ప తన గురించి ఆలోచించే అవసరం ఆ మెకు కలగలేదు. కాని అటువంటి అవసరం కలిగే నాటికి ఆమె చుట్టూ ఒంటరితనం అల్లుకు పోయింది.

సువర్ణలత వాళ్ళింట్లో చాలా మార్పులు వచ్చాయి. తండ్రిబాగా ముసలాడైపోయాడు. తల్లి కూతురిమీద బెంగతో కన్ను మూసింది. అన్నదమ్ములు ముగ్గురూ పెళ్ళిళ్ళు చేసుకొని ఎవరిదారి వాళ్ళు చూసుకున్నారు

ఏళ్ళు గడుస్తున్నకొద్దీ సువర్ణకు తన పొరపాటు తెలియవచ్చింది. ఆ మెకున్న ఒక్క ఆధారమైన తండ్రికూడా మరణించ డంతో బాగా ఒంటరిదై పోయింది.

ముసలివాడైన తండ్రికి యిబ్బంది కలుగు తుందని సువర్ణ ఎప్పుడూ ఉద్యోగం గురించి ఆలోచించలేదు. తను ఎవరిమీద భారంగా వచ్చేస్తుందోనని ఆలోచిస్తున్న తన అన్నలని, వదినలని చూసి అప్పట్లో ఉద్యోగంలోనైనా చేరక పోయినందుకు తనని తాను మంద లించుకుంది. ఆ ఒంటరి తనంలో వెలుగు కిరణంలా వకుళ గుర్తుకొచ్చింది.

* * *

వకుళని చూస్తుంటే సువర్ణకు ఆశ్చర్యం కలిగింది. కొంచెం అమాయకంగా ఉన్నట్లు కనిపించే వకుళ చకచకా ఒకవైపు ఇంట్లో పనులు చక్కబెట్టుకుంటూనే భర్తనీ, పిల్లల్ని చూసుకుంటూ బాధ్యతగా ప్రతీపనీ చేస్తూ యిప్పుడు పెద్ద ఆరిందాలా కనిపించింది.

''అక్కడికి నేను చెప్పిన సలహాలన్నీ పాటించేసినట్లు...'' నవ్వుతూ అనేసింది వకుళ. ఆ తర్వాత తన తప్పు తెలిసింది. 'అయ్యో సువర్ణ మనసు నొప్పించానేమో' నని బాధపడింది. కాని సువర్ణ ఆదేమీ గమ నించలేదు. ఇంట్లో పరిస్థితులన్నీ వివరంగా చెప్పి అంది. 'ఇన్నాళ్ళూ నాన్నగారికి పెన్షన్ వచ్చేది. అందుచేత నేను వాళ్ళకి భారంగా ఉన్నానేమోనన్నభావం వాళ్లకిగానీ, నాకు గానీ కలగలేదు. ఇప్పుడు నేను ఎవరి దగ్గర ఉంటానో అని అన్నదమ్ములు భయ పడవలసి రావటంగానీ, వాళ్ళకి భారం కావటం కానీ ఎందుకని ఉద్యోగం చూసు కోవాలనుకుంటున్నాను. నువ్వు మీ ఆయనతో చెప్పి ఎక్కడైనా చిన్న ఉద్యోగమైనా చూసి పెట్టమని అడుగు. ఎంత వచ్చినా నాకొక్క దానికి చాలు కదా.

కొంతసేపు ఊరుకొని వకుళ అంది. "నువ్వేమీ అనుకోనంటే ఓ విషయం చెప్తాను."

"నే ననుకునేదేమిటి కానీ చెప్పు" అంది. ఆ మాటలో ఏమంత ఆతృత కనిపించలేదు వకుళకి. అయినా చెప్పింది. ఆ మధ్య మేము తిరుపతి వెళ్ళామని రాశానుకదా, అక్కడ రంగనాథరావు కనిపించాడు-" అంటూ చెప్పబోయి ఆగి సువర్ణవైపు చూసింది. సువర్ణ కళ్ళలో కుతూహలం తొంగి చూసింది.

"... అతని భార్య చనిపోయిందట. ఇద్దరు పిల్లలట. యాత్రలు చేద్దామని బయలుదేరాడట. మమ్మల్ని చూసి సంతోషంగా మాట్లాడేడు. చాలాసేపు సంశయించి ఆఖరికి నీ గురించి అడిగేడు. నువ్వు ఇంకా ఇలాగే వున్నావని చెప్తే చాలాబాధ పడ్డాడు. ఎంతసేపటికోగానీ తేరుకోలేదు. రెండ్రోజులు అతను మాతోనే తిరిగాడు, మేము వచ్చేసిన రోజు స్టేషన్లో ఓ విషయం చెప్పేడు..."

"ఏమిటి?" కళ్ళతోనే ప్రశ్నించింది.

"ఉత్తరంలోనే నీకు రాయాలనుకొని నేను ఆ విషయాలు రాస్తే నువ్వు ఉత్తరాలు మానేస్తానంటా వేమోనని రాయలేదు. ఉద్యోగం ఎందుకు? అక్కడికి వెళ్ళకూడదూ?

"నేను ఉద్యోగం చూపలేనని చెప్పరాదూ?" అంది. ఆ మాటల్లో విసుగు, అసహనం, కోపం కలగలిసి ధ్వనించాయి.

సువర్ణ తత్వం తెలిసినది కావటంచేత కోపం తెచ్చుకోలేదు వకుళ కొంచెంసేపు వూరుకొని అంది "రంగనాథరావు ఏమన్నాడో చెప్పనా, అతనికి ఆరోగ్యం బాగు లేదట. మొండిగా ప్రవర్తిస్తే ప్రమాదమని డాక్టర్లు చెప్పారట. ఇప్పుడైనా సువర్ణకి అభ్యంతరం లేకపోతే నా దగ్గరకి రమ్మని చెప్పండి' అన్నాడు."

మరో మూడు రోజులు సువర్ణ అక్కడే వుంది. కానీ ఆ మూడురోజులు వకుళ పిల్లల్ని మరీ ఎక్కువగా చేరదీసింది. వాళ్ళతో వున్నప్పుడు నవ్వుతూ వాళ్ళతో తనూ ఒక చిన్న పాపలా ఆడుకుంది. కానీ ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రం ఏదో ఆలోచనలో ఉన్నట్లుగా నిర్లిప్తంగా ఉండిపోయేది.

సువర్ణ అక్కడినుండి వెళ్ళిపోతున్నరోజు స్టేషన్లో బండి కదిలేముందు అంది వకుళ. "నీనుండి సంతోషకరమైన వార్త వింటానని ఆశిస్తున్నాను. త్వరలో ఉత్తరం రాయాలి సుమా."

సువర్ణ వెళ్ళిన పదిహేను రోజులకు ఓ ఉత్తరం అందుకుంది వకుళ. అందులో మామూలు విషయాలు అన్నీ అయిపోయాక చివర్లో- ... "ఇన్నాళ్ళకి తిరిగి అక్కడికే వెళ్ళి యిద్దరు పాపలకి మాత్రమే ఆయాగా ఉండాలనుకోవటం స్వార్థమే అవుతుందని పించి యిక్కడికి వచ్చేశాను..." అని వుంది. ఉత్తరం చదువుతున్న వకుళ ఓసారి కవరు వెనకవైపు తీసి చూసింది.

'పి. సువర్ణలత, కేరాఫ్ బాలమందిర్, డాబా గార్డెన్సు, విశాఖ' అన్న చిరునామా కనిపించింది.

*

## "మీరు హిపోపొకాదు కదా"

హిపోపొటామసు (ఖడ్గమృగం) ను జంతు ప్రదర్శన శాలలో చూస్తూ ఒక లలనామణి ఎన్నో ప్రశ్నలు వేస్తున్నది. చివరకు "ఈ జంతువు ఆడదా మగదా" అన్నది. అక్కడ వున్న ఒక జూ ఉద్యోగికి ప్రాణం విసిగి "మీరు హిపోపొకాదు కదా! మీకెందుకు ఆ సమాచారం" అన్నాడు.